క్లుప్తంగా

విజృంభిస్తున్న చలి



అమ్డాపూర్‌లో చలిమంటలు

మొయినాబాద్ రూరల్: గ్రామాల్లో చలి విపరీతంగా పెరిగిపోతోంది. దీంతో వృద్ధులు, దివ్యాంగులతో పాటు పిల్లలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి వణికిస్తుండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామాల్లో చిన్నాపెద్ద తేడా లేకుండా చలి మంటలు కాపుతున్నారు. రానురాను మరింత చలి పెరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

పంచాయతీ కార్యదర్శి కుటుంబాన్ని ఆదుకోవాలి

కొత్తూరు: మావోలు ఇన్ఫార్మర్ నెపంతో ములుగు జిల్లాలో హత్య చేసిన పంచాయతీ కార్యదర్శి రమేష్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సురేందర్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అంతేకాకుండా ప్రభుత్వం కార్యదర్శి కుటుంబానికి రూ. కోటి రూపాయాలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శులపై దాడులు జరగకుండా పోలీసు రక్షణ కల్పించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌చారి కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతున్నాడు. వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. దీంతో ఆయన ఆర్థికసాయం అందజేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.20లక్షల మంజూరు చేయించారు. ఈ మేరకు బాధితుడికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈదులపల్లి మాజీ సర్పంచ్ రాజుగౌడ్, రాయికల్ శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల శేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందజేస్తున్న భీంభరత్

షాబాద్: నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్‌ఎఫ్ వరమని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పామెన భీం భరత్ అన్నారు. మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బైండ్ల రమేశ్‌కు శుక్రవారం రూ.55 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అంజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెల్ల రేషన్ కార్డు, ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న ప్రతిఒక్కరూ సీఎంఆర్‌ఎఫ్‌కు అర్హులన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందునే విషయంలో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం రెడ్డి, నాయకులు బందయ్య, నర్సింహులు, రాంచంద్రయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులతో దాత మల్లేశ్, ఉపాధ్యాయులు

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని సురంగల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జహీర్ అన్నారు. దాత మేకల మల్లేశ్ కురుమ సౌజన్యంతో శుక్రవారం విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు రాధ, నాయకులు సీతారాంరెడ్డి, రాజు, జగన్, మహేందర్‌రెడ్డి, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీతారాంపూర్‌లో నిర్వహించిన అయ్యప్ప పూజలో పాల్గొన్న చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి



సురంగల్‌లో మొక్కలు నాటిన అయ్యప్ప భక్తులు

ధైవ చింతనతో ప్రశాంతత

• మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

చేవెళ్ల: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని రామన్నగూడలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకుడు దయాకర్ ఏర్పాటు చేసిన అయ్యప్ప పడి పూజకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తి భావాలను అలవర్చుకోవాలని సూచించారు. నర్సింగ్‌రావు బృందం ఆలపించిన అయ్యప్ప భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డీసీ ఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, శైలజ, ఆగిరెడ్డి, పి. ప్రభాకర్, డాక్టర్ వైభవ్‌రెడ్డి, శంకర్, క్రిష్ణారెడ్డి, మానిక్యరెడ్డి, శేఖర్, శివప్రసాద్, వెంకటేశ్, ఇంద్రాసేనారెడ్డి, ప్రభాకర్, మాదవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సీతారాంపూర్‌లో..

షాబాద్: మండల పరిధిలోని సీతారాంపూర్ మాజీ ఉప సర్పంచ్ కటిక సందీప్‌స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ పట్నం అవినాశ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వాములు చేసిన అయ్యప్ప నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాండురగారెడ్డి, స్వాములు సురేశ్‌గౌడ్, సురేందర్, జగన్, శివ, దుగేశ్, ప్రశాంత్‌రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులున్నారు

మొక్కలు నాటిన అయ్యప్పలు

మొయినాబాద్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం బాధ్యతాయుతంగా చేపట్టాలని అయ్యప్ప భక్తుడు, గురుస్వామి రవీందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సురంగల్ అయ్యప్ప సన్నిధానం, మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాల్లో శుక్రవారం కొబ్బరి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు శోభన్‌రెడ్డి, శివ, విజయ్‌గౌడ్, జగన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, సాయికిరణ్ రెడ్డి, అంజియాదవ్, పవన్‌రెడ్డి, రాజారెడ్డి, మాణిక్ రెడ్డి, అరవింద్‌రెడ్డి, మధురెడ్డి, జ్ఞానేశ్వర్‌యాదవ్, ప్రదీప్, మహేందర్, సురేష్, హరీష్, గణేష్, సాయి తదితరులు ఉన్నారు.



రామన్నగూడలో నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న సబితారెడ్డి తదితరులు

చదువుపై పట్టు సాధించాలి

• హెచ్‌ఎంలు గోపాల్, లక్ష్మయ్య

చేవెళ్ల: పాఠశాల స్థాయిలోనే చదువుపై పట్టు సాధించాలని తంగడపల్లి, కౌకుంట్ల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గోపాల్, లక్ష్మయ్య విద్యార్థులకు సూచించారు. వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8, 9,10 తరగతుల విద్యార్థులకు శుక్రవారం కేరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలా చదువుకోవాలి..? భవిష్యత్‌లో ఎలా రాణించాలి అనే అంశాలను వివరించారు. తెలిసీ తెలియని వయసులో ఉండే విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ భద్రయ్య, కేరీర్ గైడెన్స్ ట్రైనర్ మహేశ్ కుమార్, మేనేజర్ పవన్‌కుమార్, రమేశ్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



కౌకుంట్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో మాట్లాడుతున్న శిక్షకులు మహేశ్‌కుమార్

పరామర్శ

మొయినాబాద్: ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి శుక్రవారం పరామర్శించారు. మొయినాబాద్‌కు చెందిన ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవూఫ్ తల్లి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌గౌడ్ తల్లి ఇటీవల మృతిచెందారు. దీంతో రవూఫ్‌తో పాటు మోహన్‌గౌడ్, వారి కుటుంబ సభ్యులను కలిసిన సబితారెడ్డి ధైర్యం చెప్పారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, సీనియర్ నాయకుడు షేక్ మహబూబ్, దేశమొళ్ల ఆంజనేయులు, నాయకులు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



రవూఫ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సబితారెడ్డి

శివాలయానికి రూ.12 లక్షల విరాళం

చేవెళ్ల/శంకర్‌పల్లి: దైవచింతన కార్యక్రమాల్లో పాల్గొని ఆలయల అభివృద్ధికి సహకారం అందించటం అభినందనీయమని చందిప్ప మరకత శివాలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని చందిప్పలో ఉన్న మరకత శివాలయానికి రాపోలు నీలావతమ్మ అనే భక్తురాలు శుక్రవారం రూ.12 లక్షల చెక్కును విరాళంగా చైర్మన్‌కు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



చెక్కును ఆలయ కమిటీ చైర్మన్‌కు అందిస్తున్న నీలావతమ్మ

ఫార్మసీ రంగంలో అనేక ఉద్యోగాలు

జేఎన్‌టీయూహెచ్ కెమిస్ట్రీ హెచ్‌ఓడీ రమాదేవి

అబ్దుల్లాపూర్‌మెట్: గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఫార్మసీ రంగంలో అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని జేఎన్‌టీయూహెచ్ కెమిస్ట్రీ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ బి.రమాదేవి అన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిధి గుంతపల్లి గ్రామంలో అవంతి విద్యాసంస్థల్లో బీ ఫార్మసీ, డీ ఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమలోని భయాందోళనను తొలగించుకుని, ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తూ ముందుకు సాగాలని చెప్పారు. అప్పుడే మంచి ఉద్యోగాలను సొంతం చేసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధాత్రి హెల్త్‌కేర్ సెంటర్ ఫౌండర్, ఎండీ చంద్రశేఖర్, బ్రహ్మకుమారి కవిత, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ స్వామిరావు, పీఆర్‌ఓ శ్రీనివాస్‌నాయుడు, క్యాంపస్ ఇన్‌చార్జి బోసుబాబుల, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రొఫెసర్ రమాదేవి తదితరులు

బాధిత రైతులకు ఇళ్ల స్థలాలివ్వాలి

• సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి కృషిచేయాలి
• మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

షాబాద్: సీతారాంపూర్ గ్రామ రైతులకు వెంటనే ఇళ్ల స్థలాలు అందించాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సీతారాంపూర్‌లో ఉన్న సీతారామచంద్ర స్వామి దేవాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అవినాశ్‌రెడ్డితో కలిసి సందర్శించారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దేవాదాయశాఖకు చెందిన భూమిని కంపెనీల ఏర్పాటు కోసం కేటాయించారన్నారు. అప్పట్లో రైతుల నుంచి భూములు తీసుకునే సమయంలో బాధితులుకు ప్లాట్లు (ఇళ్ల స్థలాలు) ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే ఆలయ అభివృద్ధి కోసం రూ.89 కోట్లు దేవాలయం ఖాతాల్లో జమచేశారని, ఇప్పటి వరకు పనులు చేపట్టలేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక చొరవ తీసుకుని రైతులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించడంతో పాటు ఆలయ నిర్మాణానికి కృషిచేయాలని సూచించారు. ఆమె వెంట డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు అనంతరెడ్డి, ఆంజనేయులు, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, నాయకులు హితీశ్‌రెడ్డి, వాసుదేవారెడ్డి, నర్సింహారెడ్డి, సుదర్శన్, తదితరులు ఉన్నారు.



సీతారాంపూర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

‘ఐక్యత’ సేవలు వినియోగించుకోండి



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్ సూచించారు. పట్టణంలోని లక్ష్మీగార్డెన్‌లో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరం శుక్రవారానికి నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ.. ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డితో కలిసి శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో పలువురికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేశారు. 20 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు శ్రీరాములు, నరేందర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, కొండల్‌రెడ్డి, మల్లయ్య, కొండల్‌యాదవ్, రమేశ్‌నాయక్, రఘు, యాదయ్య, శేఖర్, శ్రీను, మహేశ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. సాగర్‌రోడ్డుపై అంబేడ్కర్ కూడలి వద్ద శుక్రవారం ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతి వేగం, అజాగ్రత్త, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వలన తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులకు షీటీం సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వేధింపులకు గురైతే షీటీం నంబరు 8712662111 లేదా 100కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం, గ్రీన్‌ఫార్మాసిటీ, మాడ్గుల్ సీఐలు సత్యనారాయణ, లిక్కి కృష్ణంరాజు, జగదీశ్వర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై గురించి అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

పొదుపు సభ్యులకు పాస్ బుక్‌లు పంపిణీ

తలకొండపల్లి: పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తలకొండపల్లిలో ఏపీఎం శ్రీదేవి, సంఘం సభ్యులు.. సభ్యత్వం లేని వారిని కలిశారు. సంఘం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. నేటి నుంచి డిసెంబర్ 9 వరకు చేరిక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా సంఘంలో చేరిన మహిళలకు వ్యక్తిగత పాస్ బుక్‌లు పంపిణీ చేశారు. నెలనెలా క్రమం తప్పకుండా పొదుపు డబ్బులు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు దీపా, రాములు, విజయలక్ష్మి, సత్యం, లక్ష్మయ్య, ఎంఎంఎస్ అధ్యక్షురాళ్లు మల్లమ్మ, వీఓఏలు పాల్గొన్నారు.

సర్కార్ బడుల బలోపేతానికి కృషి

మండల విద్యాధికారి పాండు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ పాండు

ఆమనగల్లు: విద్యార్థుల సంఖ్యను పెంచి, ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేయాలని ఎంఈఓ పాండు కోరారు. పట్టణంలోని ఎంఆర్‌సీ భవనంలో శుక్రవారం మండల పరిధి పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, అనుమతి లేకుండా గైర్హాజరు కారాదని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో అన్ని రకాల రిజిస్టర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు బోధన సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి, పద్మ, మండల కో ఆర్డినేటర్ సాయికుమార్, సీఆర్‌పీలు షేక్ అహ్మద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులను విడుదల చేయాలి

మంచాల: వికారాబాద్ కలెక్టర్‌పై దాడి ఘటన నేపథ్యంలో అరెస్టు చేసిన లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన మాట్లాడారు. ఫార్మా కంపెనీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల భూములను లాక్కోవాలని చూడటం దారుణమన్నారు. సాగు చేసుకునే భూములను ఇవ్వమని రైతులు చెప్పినా.. వినిపించుకోకుండా చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో అనుకోకుండా జరిగిన దాడిని బూచిగా చూపుతూ రాత్రి పూట ఇళ్లల్లోకి చొరబడి రైతులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని ప్రశ్నించారు. బాధిత రైతులకు పార్టీ అండగా ఉంటుందని, వెంటనే వారిని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుల్లారెడ్డి, నాయకులు కిషన్‌రెడ్డి, వెంకటేశ్, జానీ పాష, రాజేష్, సత్తయ్య పాల్గొన్నారు.

డీసీసీ లీగల్ సెల్ కన్వీనర్‌గా సంతోష్‌గౌడ్



అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా హయత్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందుటి సంతోష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతి గౌడ్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌గౌడ్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూనే, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. లీగల్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌గౌడ్, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు భిక్షపతిగౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం తగదు

• రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి
• మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ ఆదిలక్ష్మి

ఆమనగల్లు: ధాన్యం కొనుగోలులో అలసత్వం తగదని, రైతులు తెచ్చిన వెంటనే కాంటా వేయాలని మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ ఆదిలక్ష్మి సూచించారు. కేంద్రం వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీఓ కుసుమమాధురితో కలిసి తనిఖీ చేశారు. అక్కడి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన వసతులు కల్పించాలని, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ భూదేవి, నిఖిత, పీఏసీఎస్ సిబ్బంది మహేశ్ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రత్యేకాధికారి ఆదిలక్ష్మి, ఎంపీడీఓ కుసుమమాధురి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని వారు సందర్శించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చేపట్టాల్సిన పనుల గురించి చర్చించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. మందుల కొరత లేకుండా చూడాలన్నారు. దవాఖానలో అవసరమైన వసతుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పరిక్షిత్ నరేందర్, డాక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఆదిలక్ష్మి